# సాక్షి మంచిర్యాల

బుధవారం : 3 ఏప్రిల్ : 2024




**కష్టపడ్డ కార్యకర్తలను కడుపులో పెట్టుకుంటా** 8లో▸

కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటానని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు హామీ ఇచ్చారు. జన్నారంలో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

**రంజాన్ వేళలు**

బుధ: ఇఫ్తార్ 6:32

గురు: సహర్ 4:45

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 41.0 /27.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి పెరిగి ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమవుతుంది.

## న్యూస్‌రీల్

### మూల్యాంకనంపై సమావేశం

**మంచిర్యాలఅర్బన్:** బుధవారం నుంచి ప్రారంభించనున్న పదోతరగతి మూల్యాంకనంపై జిల్లా విద్యాధికారి యాదయ్య జిల్లా కేంద్రంలోని కార్మెల్ హైస్కూల్‌లో అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మూల్యాంకనం విధుల గురించి అవగాహన కల్పించారు. మూల్యాంకనం విధులకు హాజరయ్యే వారంతా నిర్ణీత సమయంలోపు చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లకు అనుమతి లేదని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ దామోదర్‌రావు తదితరులున్నారు.

### ప్రాణదాతలుగా ఈఎంటీలు



కేక్ కట్ చేస్తున్న ఈఎంటీలు

**పాతమంచిర్యాల:** ఆపద సమయంలో ఈఎంటీలు ప్రాణదాతలుగా నిలుస్తున్నారని ఉమ్మడి జిల్లా 108 వాహన సర్వీసుల ప్రోగ్రాం మేనేజర్ స్వామాట్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని 108 వాహన సర్వీసుల కార్యాలయంలో జాతీయ వైద్య సాంకేతిక నిపుణుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యానికి గురైనవారికి, గర్భిణులకు ఈఎంటీలు సకాలంలో సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రమాదాల్లో గాయపడినవారి వద్దకు సకాలంలో చేరుకుని వైద్యం అందించి ప్రాణదాతలుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. సేవాభావంతో విధులు నిర్వహిస్తున్నారని, అంకితభావంతో పని చేస్తున్నారని కొనియాడారు. 108 సర్వీసుల జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి సంపత్, ఈఎంటీలు, 108 పైలట్‌లు ఉన్నారు.

### పనులు త్వరగా పూర్తి చేయాలి



మార్కెట్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**బెల్లంపల్లి:** బెల్లంపల్లిలో నిర్మాణంలో ఉన్న సమీకృత మార్కెట్‌ను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ బీ రాహుల్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాంటా ఏరియాలోని కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను ఆకస్మికంగా పరిశీలించారు. కూరగాయలు, మాంస ఉత్పత్తులు ప్రజలకు ఒకేచోట లభించాలనే ఉద్దేశంతో మార్కెట్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మార్కెట్‌లో తాగునీరు, మూత్రశాలల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వెంటనే పూర్తి చేసి వ్యాపారులు, కొనుగోలుదారులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. మార్కెట్‌లో వ్యాపారుల కోసం ప్లాట్‌ఫామ్‌లు, కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం గ్రంథాలయానికి వెళ్లి పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువకులతో మాట్లాడారు. పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని, వేసవి దృష్ట్యా తాగునీరు, నీడ, విద్యుత్ సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు సెయింట్‌మేరీస్ ఉన్నత పాఠశాలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి హాజరయ్యారు. ఎన్నికల విధులపై సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

### ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి



చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

**పాతమంచిర్యాల:** జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ భవన్‌లో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బీసీ సంఘం నాయకులు పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు మాట్లాడుతూ.. పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. బీసీ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రమోహన్‌గౌడ్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్, బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు కొంతం రాజు, అందే సంతోష్, సమ్ముల శ్రీనివాస్, రాజేశంగౌడ్, జంగు పటేల్ ఉన్నారు.

# బడుల బాధ్యత అమ్మలదే..



జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల హైస్కూల్‌లో 212 మంది విద్యార్థులు చదువుతున్నారు. తరగతి గదుల్లో ఫ్లోరింగ్ దెబ్బతిని పాములు సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఆందోళన చెందారు. మూత్రశాలలు లేక బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సిన దుస్థితి. తీవ్ర తాగునీటి సమస్య నెలకొంది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పర్యవేక్షణలో ఈ బడిలో తాగునీటి వసతి కల్పించడం, టాయిలెట్స్, ఫ్లోరింగ్ పనులు చేపట్టనుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తంజేస్తున్నారు.



గర్మిళ్ల హైస్కూల్‌లో పూర్తిగా ధ్వంసమైన ఫ్లోరింగ్

- సర్కారు పాఠశాలల అభివృద్ధికి చర్యలు
- భవనాల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి
- మౌలికవసతుల కల్పనలో అధికారులు
- ఆదర్శ పాఠశాల కమిటీలదే పర్యవేక్షణ
- ప్రతిపాదనల తయారీలో యంత్రాంగం
- జిల్లాకు రూ.21.58కోట్లు కేటాయింపు

**మంచిర్యాలఅర్బన్:** సర్కారు పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం సంకల్పించింది. బడుల నిర్వహణను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట మహిళలకు అప్పగించింది. పాఠశాలల్లోని సమస్యల పరిష్కారం కోసం పాఠశాల యాజమాన్యాల కమిటీల స్థానంలో ఈ కమిటీలు కొలువుదీరాయి. కమిటీల పేరిట బ్యాంక్ ఖాతాలు తెరిచే ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు వేసవి సెలవుల్లోనే పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, అభివృద్ధి పనులు పూర్తి చేయాలని విద్యాశాఖ యోచిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వం జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లోని 714 పాఠశాలలకు రూ.21కోట్ల 58లక్షల 70వేల నిధులు మంజూరు చేసింది.

**సిద్ధమవుతున్న ప్రతిపాదనలు**

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో ఆయా బడుల్లో అవసరమైన పనులు చేపట్టనున్నారు. చాలాచోట్ల విద్యార్థినులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని ఆయా పాఠశాలల్లో ఏయే పనులు చేపట్టాలి.. ఎన్ని నిధులు అవసరం.. అనే అంశాలపై సంబంధిత అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు. యూడైస్ సమాచారం ఆధారంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతుల కల్పనపై క్షేత్రస్థాయి పరిశీలన కొనసాగుతోంది. ప్రధానంగా మూత్రశాలలు, మరుగుదొడ్ల మరమ్మతులు, శిథిల భవనాల మరమ్మతు, విద్యుత్ సౌకర్యం తదితర పనులు చేపట్టనున్నారు. పనుల అంచనాలు పూర్తి చేసి కలెక్టర్‌కు నివేదించనున్నారు. ఇప్పటికే వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

**నత్తనడకన 'మన ఊరు–మనబడి'**

మన ఊరు–మనబడి కింద చేపట్టిన పనులపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. 245 పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టగా నిధుల్లేక పనులు నత్తనడకన సాగాయి. మొత్తం రూ.27కోట్ల 73లక్షల 3వేల పనులకు ఎంబీ రికార్డులు చేశారు. ఇందులో రూ.18కోట్ల 53లక్షల 96 వేలు మాత్రమే విడుదల చేశారు. మిగతా నిధులు సకాలంలో రాకపోగా పనులపై ప్రభావం పడింది. తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్, ఇతరుల పనుల మాటెలా ఉన్నా డైనింగ్ హాల్ నిర్మాణాలపై ఎటూ తేలలేదు. 59 పాఠశాలల్లో డైనింగ్ హాల్ పనులు చేపట్టగా దండేపల్లి మండలం మామిడిపల్లి, పారిపల్లి పాఠశాల, బెల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్మాణాలు పూర్తి కాగా ప్రారంభించారు. మిగతా చోట్ల చిన్నచిన్న మరమ్మతులు, ఫర్నిచర్ వస్తే అందుబాటులోకి రానున్నాయి.

**బడ్జెట్ కేటాయింపులు ఇలా..**

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు పనుల బాధ్యత అప్పగించారు. తొలివిడతలో 714 పాఠశాలలకు రూ.21కోట్ల 58లక్షల 70వేలు మంజూరయ్యాయి. తాగునీటి అవసరాల కోసం (నల్లాలు, పైపులైన్, ట్యాంకులు) యూనిట్‌కు రూ.లక్ష చొప్పున 618 పనులకు రూ.6.18కోట్లు కేటాయించారు. తరగతి గదుల మరమ్మతు కోసం ఒక్కో యూనిట్‌కు రూ.2లక్షల చొప్పున 336 పనులకు రూ.7.72కోట్లు వెచ్చించనున్నారు. మరుగుదొడ్ల మరమ్మతు కోసం ఒక్కో యూనిట్‌కు రూ.35వేల చొప్పున 1,677 యూనిట్లకు రూ.5కోట్ల 86లక్షల 95వేలు కేటాయించనున్నారు. విద్యుత్ సరఫరా అవసరాల కోసం ఒక్కో యూనిట్‌కు రూ.25వేల చొప్పున 693 యూనిట్లకు రూ.కోటీ 73లక్షల 25వేలు, అర్బన్ ఏరియాల్లో విద్యార్థినుల కోసం యూనిట్‌కు రూ.3.50లక్షలతో నూతనంగా నిర్మించే మరుగుదొడ్ల కోసం రూ.కోటీ 8లక్షల 50వేల నిధులు వెచ్చించనున్నారు.

# ఓటరు నాడీపై సర్వేలు !

- పార్లమెంట్ ఎన్నికలపై ఆరా
- ఫలితాల అంచనాలో సంస్థలు



**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు నాడీ తెలుసుకునేందుకు పలు సంస్థలు సర్వే చేస్తున్నాయి. టికెట్ల కేటాయింపునకు ముందే పార్టీలు ఆశావహులపై ప్రజల్లో ఉన్న మద్దతు తెలుసుకునేందుకు పలు ఏజెన్సీలతో సర్వేలు చేపట్టాయి. సర్వే ఫలితాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో ప్రజల మద్దతు ఎవరివైపు ఉందో.. తెలుసుకునేందుకు మళ్లీ సర్వేలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర సంస్థలూ ప్రయత్నిస్తున్నాయి. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్లను పలు కోణాల్లో పలకరిస్తున్నాయి. బరిలో ఉన్న అభ్యర్థుల సత్తా తెలుసుకునేందుకు ముందస్తుగా అంచనా వేస్తున్నాయి. వీటిలో పార్టీల ఏజెన్సీలు, కార్పొరేట్ స్థాయి సంస్థలు, మీడియా, ఇతర సంస్థలున్నాయి.

**ఓటర్లను నేరుగా సంప్రదిస్తూ..**

వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుంది? ప్రజల మద్దతు ఎటువైపు ఉంది? తదితర విషయాలు తెలుసుకునేందుకు నేరుగా సర్వే సంస్థలు ఓటర్లనే ఫోన్‌లో సంప్రదిస్తున్నాయి. ఇప్పటికీ జిల్లాలో చాలామంది ఓటర్లకు కాల్స్ వస్తూనే ఉన్నాయి. 'ఎవరికి ఓటేస్తారు?.. ఎంపీగా ఎవరైతే బాగుంటుంది?' అని టెలీ కాలర్స్ అడుగుతున్నారు. కొందరు బదులిస్తుండగా, మరికొందరు దాటవేస్తున్నారు. దీంతో సర్వే సంస్థలూ నేరుగా ఓటర్ల వద్దకే వెళ్లి పలకరిస్తున్నాయి. పల్లెలు, పట్టణాల్లో తమ సిబ్బందితో ఓటరు నాడీ తెలుసుకుంటున్నాయి. వివిధ వర్గాలు, పల్లె, పట్టణాల వారీగా పలు కోణాల్లో శాంపిళ్లు సేకరిస్తున్నాయి.

**సోషల్ మీడియాలోనూ..**

సోషల్ మీడియా వేదికగాను సర్వేలు కొనసాగుతున్నాయి. వాట్సాప్ గ్రూపుల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల పేర్లు ప్రదర్శిస్తూ ఓటింగ్ నిర్వహిస్తున్నారు. ఫేస్‌బుక్, ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్లలోనూ సర్వే చేస్తున్నారు. ఇటీవల ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి పేరుతో ఓ ఆన్‌లైన్ సంస్థ ఓటింగ్ నిర్వహించింది. అయితే కొన్ని సర్వే సంస్థలు వెల్లడిస్తున్న ఫలితాలు అభ్యర్థులను అయోమయానికి గురి చేస్తున్నాయి. ఫలానా పార్టీకే ఓటర్ల మద్దతు ఉందంటూ వెల్లడిస్తుండడంతో మిగతావారు గందరగోళంలో పడుతున్నారు. కొంతమందికి వ్యక్తిగతంగా లబ్ధి పొందేందుకు రాజకీయంగా ప్రత్యర్థులు చేస్తున్న ఎత్తుగడలుగా విమర్శలు వస్తున్నాయి. ఈ సర్వే కారణంగా అటు ప్రజలు, ఇటు అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు.

# సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం

**మంచిర్యాలక్రైం:** రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను సీపీ శ్రీనివాసులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ మోసగాళ్ల చేతిలో వంచనకు గురైనవారి వెసులుబాటు కోసం ప్రత్యేకంగా సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టి బాధితులకు సత్వర సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినవారు టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి నేరుగా సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏసీపీ వెంకటరమణ పర్యవేక్షణాధికారిగా, సీఐగా కృష్ణమూర్తి, ఒక హెడ్ కానిస్టేబుల్, ఏడుగురు కానిస్టేబుళ్లు ఉంటారని వివరించారు. సైబర్ నేరాలకు సంబంధించిన కేసులన్నీ ఇక్కడే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఎఫ్‌ఐఆర్ నమోదు, విచారణ కూడా ఇక్కడే ఉంటుందని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అడిషనల్ డీసీపీ రాజు (అడ్మిన్) ఎస్బీ ఏసీపీ రాఘవేంద్రరావ్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఠాణాను ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాసులు

# నీటి ఎద్దడి నివారణకు చర్యలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంతోష్, వివిధ శాఖల అధికారులు

- కలెక్టర్ బీ సంతోష్
- అధికారులతో సమీక్ష

**మంచిర్యాలఅగ్రికల్చర్:** జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీ సంతోష్ సూచించారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళతో కలిసి తాగునీటి సరఫరా, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, వడదెబ్బ నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నిరంతర తాగునీటి సరఫరాకు అదనపు కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరించాలని సూచించారు. మండల, గ్రామ, వార్డు స్థాయిలో ప్రత్యేకాధికారులను నియమించి అవసరమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. చేతిపంపులు, బోర్‌వెల్‌ల మరమ్మతు చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా చూడాలని, పైప్‌లైన్ల లీకేజీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బోర్‌వెల్‌లు, నల్లా కనెక్షన్ల ద్వారా తాగునీరు సరఫరా చేయలేని ప్రాంతాలకు ప్రత్యామ్నాయ పద్ధతిలో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. నీటి సరఫరాకు అవకాశం లేని ప్రాంతాల్లో వ్యవసాయ బోరుబావులు, ఎండిపోని తాగునీటి బోర్లు అద్దెకు తీసుకుని తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని గ్రామాలను విధిగా సందర్శిస్తూ సమస్యలపై అధికారులకు సమాచారం అందించి పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు. జిల్లాలోని 262 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ నెల 5లోపు పూర్తి స్థాయిలో ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందులో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు 105, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 130, డీసీఎంఎస్‌కు 27 కొనుగోలు కేంద్రాలు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వడదెబ్బ సంబంధిత వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. సమీక్షా సమావేశంలో డీపీవో వెంకటేశ్వర్‌రావు, జెడ్పీసీఈవో గణపతి, డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మండల ప్రత్యేకాధికారులు, జిల్లా వైద్యారోగ్యశాఖ మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

# ముదిరిన ఎండలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఈ ఇద్దరు రైతులది దండేపల్లి మండలం కొండాపూర్. వీరు సాగు చేసిన పంటలకు సరిపడా నీళ్లు అందడంలేదు. దీంతో దూరంగా ఉన్న ఓ వ్యవసాయ బావి నుంచి పైపుల ద్వారా పంటలకు నీరందించేందుకు ఇలా పాట్లు పడుతున్నారు.

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పంటల రక్షణకు అన్నదాతల పాట్లు

**దండేపల్లి:** మార్చి నుంచే ఎండలు మండుతుండగా వ్యవసాయ బావులు అడుగంటుతున్నాయి. దీంతో 20రోజులుగా మండలంలోని పలుచోట్ల పంటలు కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. గూడెం ఎత్తిపోతలు మినహా, వ్యవసాయ బావులు, బోర్ల వద్ద నీటి ఎద్దడి తలెత్తింది. మాకులపేట, నర్సాపూర్–కొండాపూర్ మధ్య, గుడిరేవు, అల్లీపూర్, బిక్కనగూడ తదితర గ్రామాల శివారుల్లో సమస్య తీవ్రంగా ఉంది. గతంలో మూడు గంటలు మోటరు నడిచినా బావిలో ఒడవని నీళ్లు ఇప్పుడు గంటలోనే ఒడుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఏప్రిల్‌లో ఎండలు మరింత మండిపోతుండగా చేతికి వచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. ప్రస్తుత యాసంగిలో నీటి ఎద్దడిని ముందే గుర్తించిన కొందరు రైతులు వరికి బదులు ఆరుతడి పంటలైన మక్క, కూరగాయలు సాగు చేశారు.

**ఒక బావి నుంచి మరో బావికి..**

ఎండల తీవ్రతకు చాలా బావుల్లో నీటిమట్టం తగ్గింది. వాగులు, చెరువులకు సమీపంలో పూర్తి నీటితో ఉన్న బావుల నుంచి పైపులు వేసి నీళ్లు లేని బావులను నింపుతున్నారు. ఎత్తిపోసిన నీటిని సమీప పంటలకు అందిస్తూ కాపాడుకుంటున్నారు.



కొండాపూర్‌లో ఒక బావి నుంచి మరో బావిలోకి వస్తున్న నీరు

### గంట పోసుడూ కష్టమే..



ఎండల తీవ్రతతో వ్యవసాయ బావిలో నీళ్లు అడుగంటినయ్. పంటకు సకాలంలో నీరు అందడంలేదు. పోయినసారికంటే ఈసారి ఇబ్బందే ఉంది. గతంలో మూడు గంటలు నడిస్తే నీళ్లు ఒడువకపోయేది. ఇప్పుడు గంట పోసుడు కష్టంగా ఉంది.

– రమేశ్, నర్సాపూర్

### రోజుకో మడి తడుపుతున్న



బావినీళ్లు సరిపోతలేవు. రోజుకో మడికి నీళ్లు పెడుతున్న. వర్షాలు తక్కువ పడటం, మార్చి నుంచే ఎండలు ముదరడంతో నీళ్లు తొందరగా అయిపోతున్నయ్. గతంలో రోజుకు మూడు, నాలుగు మడులు తడవగా ఇప్పుడు రోజుకో మడే తడుస్తోంది.

– ఇప్ప భూమన్న, కొండాపూర్

### పూడిక తీసినా ఫలితం లేదు



బావిలో నీళ్లు అడుగంటినయ్. రూ.20 వేలు పెట్టి పూడిక తీయించినా. అయినా ఫలితం లేదు. ఈసారి ఎండల తీవ్రతతో వ్యవసాయ బావుల్లో నీరు అడుగంటింది. పంట చేతికి వచ్చే సమయంలో నీళ్లు చాలక చాలా ఇబ్బంది అవుతోంది.

– తిరుపతి, కొండాపూర్

# బెల్లంపల్లిలో ఎమ్మార్పీఎస్ రాస్తారోకో

**బెల్లంపల్లి:** రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో మాదిగలకు ఒక్కచోట కూడా అవకాశం కల్పించకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం బెల్లంపల్లిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ముందుగా పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి రాస్తారోకో ప్రారంభించారు. దీంతో రాకపోకలకు అంతరాయమేర్పడింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలను విస్మరించడం శోచనీయమని, మాల సామాజిక వర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. మాదిగలకు ఒక్క ఎంపీ స్థానమైనా కేటాయించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ పట్టణాధ్యక్షుడు కుశ్నపల్లి రాజలింగు, నాయకులు కల్వల శరత్‌కుమార్, కుప్పర్తి రాజలింగు, కన్నూరి రాజలింగు, వరుణ్, శంకర్ పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

# తహసీల్ ఆఫీస్ ఎదుట ఆత్మహత్యాయత్నం

- భూకబ్జాదారులపై చర్యకు డిమాండ్

**తాండూర్:** భూకబ్జాకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఓ యువకుడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేశాడు. భూకబ్జాదారులపై చర్య తీసుకోవాలని మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రేచిని గ్రామపంచాయతీ పరిధి బారేపల్లి గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొందరు పట్టాదారుల నుంచి భూమి కొనుగోలు చేసి 60 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ పథకం కింద ఇంటి స్థలం మంజూరు చేసిందని తెలిపారు. గ్రామ బీఆర్ఎస్ నాయకుడు దత్తుమూర్తి తిరిగి ఆ భూమిని పట్టా చేసుకుని బాధితులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం దత్తుమూర్తి ఫ్లెక్సీతో ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈక్రమంలో అదే శ్రీనివాస్ అనే యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే అతడిపై నీళ్లు పోసి నిలువరించారు. విషయం తెలుసుకున్న ఎస్సై జగదీశ్‌గౌడ్, ఏఎస్సై లక్ష్మణ్ అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిరసన కార్యక్రమాలు చేపట్టవద్దని తెలిపారు. గ్రామస్తుల సమస్యపై తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రెవెన్యూ అధికారులంతా ఎన్నికల శిక్షణలో ఉన్నారని, ఈ విషయంపై విచారణ చేపట్టి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని తెలుపగా గ్రామస్తులు ఆందోళన విరమించారు.



ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న శ్రీనివాస్

## క్లుప్తంగా

### గుడుంబా తయారీదారుల అరెస్టు


నిందితుడితో పోలీసులు

భీమారం: గుడుంబా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై రాములు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని దబ్బెటరాములు, తేజావత్ తుకారాం అనే ఇరువురు ప్రభుత్వం నిషేధించిన గుడుంబాను తయారు చేసి అమ్ముతున్నారనే సమాచారంతో మంగళవారం వారి ఇళ్లపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### యువకుడి ఆత్మహత్య


శాని మృతదేహం

మంచిర్యాలక్రైం: తల నొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని గౌతమినగర్‌కు చెందిన గులాబ్‌చాంద్ కుమారుడు గణేష్‌శాని (22) టీస్టాల్‌లో పని చేసేవాడు. గత కొంతకాలంగా తలనొప్పితో బాధపడుతున్నాడు. వైద్యుల వద్దకు వెళ్లినా తక్కువ కాకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి చాంద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

### సెల్‌ఫోన్ చూడొద్దనందుకు విద్యార్థి ఆత్మహత్య

రామకృష్ణాపూర్: సెల్‌ఫోన్ చూడొద్దని చెప్పినందుకు విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని ఏజోన్ ఏరియాలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... ఏజోన్ రామాలయం ప్రాంతానికి చెందిన సెగ్గెం రామకృష్ణ-రజితల కుమారుడు మోహన్‌కుమార్(17) పాలిటెక్నిక్ చదువుతున్నాడు. కొంతకాలంగా మోహన్ చదువుపై దృష్టి సారించకపోవటం పైగా సెల్‌ఫోన్‌కు ఎక్కువగా అలవాటు పడటంతో సోమవారం రాత్రి తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన మోహన్ ఇంట్లో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మంచిర్యాల ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

రామకృష్ణాపూర్: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ వివరాల ప్రకారం... తిమ్మాపూర్‌కు చెందిన కొమ్ము ఓదెలు(58) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# అరచేతిలో డిజిటల్ లైబ్రరీ

"ఆన్‌డ్రాయిడ్ ఫోన్లు అందుబాటులోకి రావడం.. డిజిటలీకరణ పెరగడం.. ఎలక్ట్రానిక్ డివైజ్‌లు చౌకగా లభిస్తుండడంతో అన్నిరకాల సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటున్నాయి. ఫోన్‌లో మనకు కావాలిసిన సమాచారం క్షణాల్లో ప్రత్యక్షమవుతోంది. పలు రకాల సేవలు ఇంట్లో ఉండే పొందగలుగుతున్నాం. ఈ నేపథ్యంలో డిజిటల్ లైబ్రరీ కూడా అందుబాటులోకి వచ్చింది. దీంతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు తమకు కావాల్సిన సమాచారం, స్టడీ మెటీరియల్ ఇంట్లో ఉండే పొందుతున్నారు. అరచేతిలో ఉన్న ఆన్‌డ్రాయిడ్ ఫోన్‌లో చూసుకుంటున్నారు.

– నిర్మల్‌ఖిల్లా

- అందుబాటులోకి 'నేషనల్ డిజిటల్ లైబ్రరీ'
- కేంద్ర మానవవనరుల శాఖ ఆధ్వర్యంలో అందుబాటులోకి..
- లక్షలాది డిజిటల్ పుస్తకాలు.. పోటీ పరీక్షలకు ఊతం
- వినియోగించుకుంటున్న ఉమ్మడి జిల్లా అభ్యర్థులు


పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు (ఫైల్)



వెబ్‌సైట్ హోమ్‌పేజీ

**డిజిటల్ తోడ్పాటు..**

రానున్న మూడు నాలుగు నెలల కాలం మొత్తం ఉద్యోగ పోటీ పరీక్షల షెడ్యూల్‌తోనే నిండిపోయి ఉంది. టెట్ మొదలుకుని డీఎస్సీ, టీఎస్పీఎస్సీ గ్రూప్స్ పరీక్షలు మొదలుకానున్నాయి. వరుస ఉద్యోగ ప్రకటనల నేపథ్యంలో అవకాశాన్ని వినియోగించుకోవడానికి ఉమ్మడి జిల్లా అభ్యర్థులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. జిల్లా కేంద్రాల్లోని గ్రంథాలయాలకు నిరుద్యోగుల తాకిడి పెరిగిపోవడమే దీనికి తార్కాణం. ఇక స్టడీహాళ్లలో స్థలం దొరకడం కూడా గగనంగా మారింది. ప్రభుత్వ శాఖా గ్రంథాలయాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న లైబ్రరీలను కూడా నిరుద్యోగ అభ్యర్థులు వినియోగించుకుంటున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాలలో స్టడీ మెటీరియల్ సేకరణ కోసం డిజిటల్ గ్రంథాలయాలు కూడా తోడ్పడుతున్నాయి. ఏకకాలంలో పలు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు స్టడీ మెటీరియల్ పుస్తకాలు కొనడం ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. ఈ నేపథ్యంలో జాతీయస్థాయిలో కేంద్ర మానవవనరుల శాఖ ఆధ్వర్యంలో 'నేషనల్ డిజిటల్ లైబ్రరీ' పేరుతో ఇంటర్నెట్‌లో సమగ్ర సమాచారాన్ని అందిస్తోంది.

**సమాచారం సమగ్రం..**

డిజిటల్ వేదికను వినియోగించుకుంటే పోటీ పరీక్షల కోసం అవసరమయ్యే సంపూర్ణ సిలబస్ అందుబాటులో ఉంటుంది. ఇప్పటికే గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, హెచ్‌డబ్ల్యూవో, డీఏవో, తదితర పోస్టుల పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. వీటితో పాటు జాతీయస్థాయిలో యూపీఎస్సీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్, తదితర సంస్థలు వరుస ఉద్యోగ నోటిఫికేషన్ల ద్వారా ఎప్పటికప్పుడు నియామకాలు చేస్తున్నాయి. వీటికి సంబంధించిన పూర్తి సమాచారం సిలబస్ కూడా డిజిటల్ వేదికగా అందుబాటులో ఉంచారు.

### సమాచార సేకరణ ఇలా..

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ అనుమతితో ఖరగ్‌పూర్ ఐఐటీ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్‌నెట్‌లో https:// ndl. iitkgp. ac. in/ అనే వెబ్‌సైట్‌లో 'నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా' పేరుతో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేసింది. ఇందులో విషయ నిపుణుల వీడియోలు కూడా ఉన్నాయి. పాఠశాల, కళాశాల, ఇంజనీరింగ్, వైద్య, న్యాయవిద్య, సాహిత్యం, సంస్కృతం.. ఇలా అన్నిరకాల స్టడీ మెటీరియల్‌ను ఇంగ్లిష్, హిందీతో పాటు ప్రాంతీయ భాషల్లో ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. పాఠశాల పుస్తకాలు (సీబీఎస్ఈ సిలబస్), ఇంజనీరింగ్ పుస్తకాలు, లిట్రేచర్, మెడిసిన్, లా మేనేజ్‌మెంట్, ఇతర గ్రంథాలు, వివిధ రకాల పుస్తకాలు వివిధ భాషల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ పుస్తకాలన్నీ పీడీఎఫ్ ఫార్మాట్‌లో ఉండగా వెబ్‌సైట్ ఓపెన్ చేసి చదువుకోవచ్చు. లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కాగా స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్ లేదా డెస్క్‌టాప్ కంప్యూటర్‌ల ద్వారా డిజిటల్ లైబ్రరీని వినియోగించుకునేలా తీర్చిదిద్దారు. ఇంటర్‌నెట్ గూగుల్‌లో 'నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా' అని టైప్ చేస్తే డిజిటల్ లైబ్రరీ తెరుచుకుంటుంది. ఈమెయిల్ ఐడీ ద్వారా లాగిన్ అయి రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. తర్వాత మనకు కావాల్సిన అంశాలను ఎంచుకుని చదువుకోవచ్చు. లేదా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ఉంటుంది.

### దాదాపు 70 లక్షల పుస్తకాలు

ఆయా పోటీ పరీక్షలకు ఉపయోగపడే దాదాపు 70 లక్షల పుస్తకాలను ఈ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. ఎన్సీఈఆర్టీ రూపొందించిన వివిధ పాఠ్యాంశాలతో పాటు పలు ప్రముఖ యూనివర్సిటీలు రూపొందించిన పరిశోధన వ్యాసాలు, వివిధ రకాల ఉద్యోగ పరీక్షల సిలబస్ సబ్జెక్టు, విషయ పరిజ్ఞాన అంశాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 6 విభాగాలు ఉంటాయి. ఏ విభాగానికి సంబంధించిన పుస్తకం అవసరమో దానిపై క్లిక్ చేస్తే ఆయా పాఠ్యాంశాలకు సంబంధించిన డిజిటల్ పుస్తకాల పేజీలు ప్రత్యక్షమవుతాయి. వాటిని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని అవసరమైన సమయంలో చదువుకోవచ్చు.

### అందుబాటులో ఉంచాం



నిరుద్యోగ యువతకు కావాల్సిన పుస్తకాలతో పాటు డిజిటల్ లైబ్రరీని కూడా అందుబాటులో ఉంచాం. అభ్యర్థులు ఉచిత ఇంటర్నెట్ ద్వారా తమకు కావాల్సిన స్టడీ మెటీరియల్ డౌన్‌లోడ్ చేసుకుని చదువుకోవచ్చు. జాతీయ స్థాయిలో అందుబాటులోకి తెచ్చిన నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ ప్రయోజనకరంగా ఉంటుంది.

– డాక్టర్ ఏ.చక్రధారి, కావేరి గ్రంథాలయ నిర్వాహకులు, నిర్మల్

### ఆర్థికభారం తప్పింది



పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలను కొనుక్కోవడం ఆర్థిక భారంగా మారుతోంది. ఈ క్రమంలో జాతీయస్థాయిలో నేషనల్ డిజిటల్ లైబ్రరీ అందుబాటులోకి తేవడం నిరుద్యోగులకు ఊరట కలిగించింది. పోటీ పరీక్షలకు కావాల్సిన సిలబస్ స్టడీ మెటీరియల్‌ను డౌన్‌లోడ్ చేసుకుని చదువుకుంటున్నాం. ముఖ్యమైన అంశాలను నోటు పుస్తకాలలో రాసుకుంటున్నాం.

– గౌతమి, అభ్యర్థిని, ఖానాపూర్

### అవకాశాన్ని వినియోగించుకుంటున్నాం



పలు రకాల పోటీ పరీక్షలకు సిలబస్ స్టడీ మెటీరియల్ సమకూర్చుకోవడం పెద్ద సమస్యగా పరిణమిస్తున్న సందర్భంలో డిజిటల్ లైబ్రరీ తోడ్పాటు ఆహ్వానించదగినది. అభ్యర్థులకు పరీక్షల సమయంలో కావాల్సిన సమాచారాన్ని సేకరించుకోవడానికి మంచి మార్గం. సమయం కూడా కలిసి వస్తుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నాం.

– పి.ఆకాశ్, అభ్యర్థి, అనంతపేట్, నిర్మల్

### కోలిండియా పోటీలకు కొండ కార్తీక్


కొండ కార్తీక్

శ్రీరాంపూర్: ఈ నెల 4 నుండి 6 వరకు జరిగే కోల్ ఇండియా కబడ్డీ పోటీల్లో శ్రీరాంపూర్‌కు చెందిన కొండ కార్తీక్ అనే సింగరేణి క్రీడాకారులు పాల్గొననున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సింగ్రోలీ జిల్లా కుక్రి గ్రామంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. సింగరేణి నుంచి పాల్గొంటున్న జట్టులో శ్రీరాంపూర్ నుంచి కార్తీక్ పాల్గొననున్నాడు. కార్తీక్ ఆర్కే 7 గనిలో కోల్‌కట్టర్‌గా పనిచేస్తున్నాడు. జాతీయ స్థాయిలో జరిగే ఈ పోటీల్లో సింగరేణి సత్తా చాటాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాంచందర్, ఒలంపిక్ అసోసియేషన్ సెక్రెటరీ రఘునాథరెడ్డి తదితరులు ఆకాంక్షించారు.

### నగదు సీజ్

వాంకిడి: మండలంలోని టోల్‌ప్లాజా వద్ద మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో వేర్వేరు వ్యక్తుల నుంచి రూ.1,51500 నగదు పట్టుబడినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన జయకుమార్ మెంగాని వద్ద రూ.లక్ష, వాంకిడికి చెందిన సయ్యద్ ఇర్ఫాన్ వద్ద రూ.51500 పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన నగదుకు సరైన పత్రాలు లేని కారణంగా నగదును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు, వాంకిడి ఎస్సై సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

**నగదు పట్టివేత**

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై చొప్పరిపల్లి సమీపంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం వాహనాల తనిఖీల్లో ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదు పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... చింతలమానపల్లి మండలం బాబాసాగర్‌కు చెందిన గోలెం నరేష్ రూ.75 వేలు ఆధారాలు లేకుండా తరలిస్తుండగా వాహనాల తనిఖీల్లో పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని స్వాధీనం చేసుకున్న సొమ్మును ఎస్ఎస్‌టీ బృందానికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట, గూడెంలో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాల వద్ద ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును మంగళవారం రాత్రి వేర్వేరుగా పట్టుకున్నట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. తాళ్లపేట తనిఖీ కేంద్రం వద్ద ఐచర్ వ్యాన్‌లో వెళ్తున్న వ్యక్తి వద్ద రూ.90వేలు, గూడెం తనిఖీ కేంద్రం వద్ద బొలేరో వాహనంలో వెళ్తున్న వ్యక్తి వద్ద రూ.63,800 నగదును తనిఖీ బృందం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. ఎస్ఎస్‌టీ టీం ఇన్‌చార్జీలు భరత్, భాస్కర్‌రావు, లక్సెట్టిపేట రెండవ ఎస్సై రామయ్య, దండేపల్లి, లక్సెట్టిపేట ఏఎస్సైలు వెంకన్న, రాజేందర్ ఉన్నారు.

## కాసిపేట గురుకుల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరీక్షల్లో బెల్లంపల్లిలోని కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. రెండు రోజుల క్రితం వెలువడిన ఫలితాల్లో ఎనిమిది మంది విద్యార్థులు సీవోఈకి ఎంపికై సత్తాచాటినట్లు కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్ ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మక సీఓఈలకు ఎంపికైన విద్యార్థుల్లో ఓ.ఉదయ్ (బైపీసీ- గౌలి దొడ్డి), టీ.దీపక్, డి.వంశీకృష్ణ, (ఎంపీసీ - అల్గునూరు), జె.నిఖిల్, ఎల్.కుశాల్, జె.పవన్ కళ్యాణ్, డి.రాజేష్ (సీఈసీ - ఇబ్రహీంపట్నం), ఎస్ఎస్‌కే సందీప్ (ఎంఈసీ - ఇబ్రహీంపట్నం) ఎంపికైనట్లు వివరించారు. మంగళవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సదరు విద్యార్థులను ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.స్రవంతి, జేవీపీ మోహన్ పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగికి నంది పురస్కారం


పురస్కారం అందుకుంటున్న గజెల్లి రాజలింగు

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా రిటైర్డ్ ఉద్యోగి గజెల్లి రాజలింగు చేసిన సామాజిక సేవకు పురస్కారం లభించింది. కళారంగంలో, సామాజిక రంగంలో ఆయన అందించిన సేవలకు హైదరాబాద్‌కు చెందిన శిఖర ఆర్ట్ సంస్థ ఆయనకు నందీ ప్రతిభ పురస్కారాన్ని అందించింది. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర తెలంగాణ భాష సంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందించారు. సింగరేణిలో ఉద్యోగం చేస్తున్న సమయంలో కంపెనీ కమ్యూనికేషన్ సెల్ ద్వారా ఎన్నో సందేశాత్మక సీరియల్స్, నాటికల్లో ప్రదర్శనలు ఇవ్వడం, గజెల్లీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వివిధ సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టినందుకు తనకు ఈ పురస్కారం అందించారని రాజలింగు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ కార్పొరేషన్ బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం రాత్రి నస్పూర్ కాలనీలోని సింగరేణి సివిల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులు అనేక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ మాత్రం వారిని పట్టించుకోలేదని లేదన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీ హయాంలో వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వారి సమస్యల పరిష్కారానికి యజమాన్యంతో, ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులు అతడిని సన్మానించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్ రావు, జాతీయ సమితి సభ్యులు భీంరావు, కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, కలవేన శ్యాం, కాంట్రాక్ట్ కార్మికుల సంఘం ఇన్‌చార్జి పేరం రమేష్ పాల్గొన్నారు.

## వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలి

పాతమంచిర్యాల: షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ వసతి గృహాల్లో పనిచేస్తున్న వార్డెన్‌లు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బి) జిల్లా నాయకులు కనుకుంట్ల సన్నిగౌడ్ అన్నారు. మంగళవారం షెడ్యూలు కులాల అభివృద్ధి సంక్షేమశాఖ ఉప సంచాలకులు రవీందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. హస్టల్ వార్డెన్‌లు హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల సంక్షేమంపై దృష్టి సారించకుండా, విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### మోహన్‌కు నంది పురస్కారం


అవార్డు అందుకుంటున్న మోహన్

బెల్లంపల్లి: బెల్లంపల్లి బాబు క్యాంపు బస్తీకి చెందిన సామాజిక కార్యకర్త గజెల్లి మోహన్‌కు నంది పురస్కారం వరించింది. సామాజిక సేవా కార్యక్రమాలు మూడు దశాబ్దాలుగా చేస్తుండడంతో ఆయన కృషికి అవార్డు లభించింది. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శిఖర ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేశారు. మోహన్‌కు శాలువ కప్పి నిర్వాహకులు పురస్కారాన్ని అందజేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీఎస్.ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు మోహన్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

### డాక్యుమెంట్ రైటర్స్‌తో సీఐ సమావేశం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని డాక్యుమెంట్ రైటర్స్‌తో స్థానిక సీఐ బన్సీలాల్ సమావేశం నిర్వహించినట్లు సమాచారం. ఫేక్ డాక్యుమెంట్, డబుల్ రిజిస్ట్రేషన్, ఏక పక్ష సవరణపై ఆరా తీశారు. కొందరు రైటర్స్ కాసులకు కక్కుర్తి పడి ఫేక్ డాక్యుమెంట్ సృష్టించి వివాదాలకు తెర లేపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జిల్లా కేంద్రంలో అధికంగా స్థల వివాద సమస్యలు డబుల్ రిజిస్ట్రేషన్, ఫేక్ డాక్యుమెంట్ పత్రాలకు సంబంధించినవే వస్తున్నాయని, ఇటీవల కొన్ని ఫిర్యాదులు పోలీస్‌స్టేషన్‌కు రావడంతో డాక్యుమెంట్ రైటర్స్‌తో సమావేశం నిర్వహించి మందలించినట్లు సమాచారం. ఏకపక్ష సవరణలో డాక్యుమెంట్ రైటర్స్ తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నారని, రిజిస్ట్రేషన్ ఫీజులు, డాక్యుమెంట్ తయారు చేసి ఇచ్చినందుకు ఎంత వసూల్ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. డాక్యుమెంట్ రైటర్స్ పేర్లు, సెల్ నంబర్లు సేకరించినట్లు తెలిసింది. ఫేక్ డాక్యుమెంట్, డబుల్ రిజిస్ట్రేషన్‌లపై రైటర్స్ జాగ్రత్తలువహించాలని, నిబంధనల ప్రకారమే పనిచేయాలని సూచించినట్లు సమాచారం.

### బాలిక అదృశ్యం

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బాలిక మార్చి 31న ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబీకులు వారి బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ కానరాలేదు. దీంతో బాలిక తండ్రి దే వాజీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## కష్టపడిన కార్యకర్తలను కడుపులో పెట్టుకుంటా

- ఎంపీగా గెలిపించుకుని, అభివృద్ధికి బాటలు వేద్దాం
- ఎమ్మెల్యే బొజ్జు పటేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం: ఎన్నికల్లో నా గెలుపు కోసం కష్టపడ్డ కార్యకర్తలను, ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కష్టపడే నాయకులను, కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటానని, నన్ను బద్నాం చేస్తే వారిని బట్టలూడదీసి కొడుతానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. మంగళవారం జన్నారం మండల కేంద్రంలోని పైడిపెల్లి ఫంక్షన్ హాలులో పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ అభ్యర్థి సుగుణతో పాటు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం నేను డబ్బులు తీసుకుంటున్నట్లు కొందరు ఆరోపించారని నా దృష్టికి వచ్చిందని, అలాంటి వారిని ఉపేక్షించబోనని హెచ్చరించారు. బ్లాక్ మేయిల్ చేసేవారు, డబ్బులు తీసుకునేవారు స్వచ్ఛందంగా వెళ్లిపోవచ్చన్నారు. అసలైన కార్యకర్తలను నేనెప్పుడు మరువనని, అర్ధరాత్రి ఆపద వచ్చిన అండగా నిలుస్తానని తెలిపారు.

**కొంగుచాచి అడుగుతున్న ఆశీర్వదించండి..**
**– ఆత్రం సుగుణ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి**

మీ మండలం బిడ్డగా, మీ మండల వాసిగా, మీ ముందుకు ఎంపీ అభ్యర్థిగా వచ్చాను. కొంగు చాచి అడుగుతున్న ఎన్నికల్లో ఓట్లు వేసి ఆశీర్వదించాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కోరారు. కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రాజకీయంలోకి రాకముందే ప్రజల సమస్యలపై గళం విప్పానని, ప్రజల సమస్యలపై అవగాహన ఉందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాజశేఖర్, శుభాష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రవి, ఎంపీటీసీ రియాజోద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ అశోక్‌కుమార్

బెల్లంపల్లి: గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు యువకులను బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్యతో కలిసి మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్ వివరాలు వెల్లడించారు. బెల్లంపల్లికి చెందిన లింగాల యశ్వంత్, తోట మణిదీప్, నవీద్, ముజ్జు అనే యువకులు చెడు అలవాట్లకు బానిసై మహారాష్ట్రంలోని చంద్రపూర్, బల్లార్షా ప్రాంతాల నుంచి గంజాయిని తక్కువ ధరకు తీసుకొచ్చి ఇక్కడి యువకులకు ఎక్కువ ధరకు విక్రయిస్తూ జల్సాలు చేస్తున్నారు. మంగళవారం సదరు నలుగురు యువకులు చంద్రపూర్ నుంచి గంజాయిని తీసుకురాగా వీరిలో యశ్వంత్, మణిదీప్ కొత్తబస్టాండ్ ఏరియాలో గంజాయిని ఓ కవర్‌లో పెట్టుకుని వెళ్తుండగా పెట్రోలింగ్ సిబ్బంది గమనించి ఎస్సై రమేష్‌కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు చాకచక్యంగా వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందిదులు నవీద్, ముజ్జు పరారీలో ఉన్నారు. యువకులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని డీసీపీ అశోక్‌కుమార్ సూచించారు. చట్టవ్యతిరేక పనులు చేసే వ్యక్తులు ఎంతటి వారైన ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

## జెడ్పీ హైస్కూల్‌లో స్పోర్ట్స్ కిట్ చోరీ

భీమారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాతలు అందించిన స్పోర్ట్స్ కిట్ చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో చదువుతున్న వి ద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సహించేందుకు అప్ప టి ఎంపీడీవో శ్రీనివాస్ దాదాపు రూ.20వేల విలువ గల స్పోర్ట్స్ కిట్‌ని పాఠశాలకు అందజేశారు. ఆ కిట్‌ని పాఠశాలలోని ప్రధానోపాధ్యాయుడి గదిలో భద్రపరిచారు. అయితే విద్యార్థులు ఉపయోగించకముందే అది చోరీకి గురైనట్లు సమాచారం. అదే విధంగా తరగతి గదిలో ఉంచిన 16 పాత సీలింగ్ ఫ్యాన్లకి కనిపించకుండాపోయినట్లు తెలిసింది. పాఠశా ల భవనం మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ. 50 లక్షలు మంజూరు చేయగా అందులో భా గంగా అన్ని గదుల్లోని పాత ఫ్యాన్లు తొలగించి కొత్త ఫ్యాన్లు బిగించారు. అయితే పాత ఫ్యాన్లు కనిపించడం లేదు. ఈ విషయంలో పాఠశాల హెడ్మాస్టర్ విక్రమ్ కుమార్‌ని సాక్షి వివరణ కోరగా స్పోర్ట్స్ కిట్ చోరీకి గురైందని, ఫ్యాన్లు మాత్రం కొత్తవి బిగించిన కాంట్రాక్టర్ పాతవి తీసికెళ్లినట్లు తెలిపారు. ఫ్యాన్లు లేని గదుల్లో పాతవి బిగించాలి. కానీ వాటిని కాంట్రాక్టర్ ఎందుకు తీసుకెళ్లాడని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.